దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్, మార్చి 20 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో వివిధ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు శంకర్‌పల్లి గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ జయమ్మ, చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ డి రమాదేవి వేర్వేరు ప్రకటనలో బుధవారం పేర్కొన్నారు. గురుకుల పాఠశాలల్లో 6,7,8,9 తగరతుల్లో బ్యాక్ లాగ్ సీట్ల భర్తీ కోసం గురుకుల విద్యా సంస్థ దరఖాస్తులు కోరుతుందని అర్హులైన విద్యార్థులు తరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తులు చేసుకోవడానికి గురుకుల విద్యా సంస్థ ఈ నెల 23వ తేదీ వరకు అవకాశం ఇచ్చిందన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21 ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందని తెలిపారు. పాఠశాలల వెబ్‌సైట్www.tswreis.ac.in లో సంప్రదించాలని కోరారు.

మట్టి అక్రమ రవాణా.. టిప్పర్లు సీజ్

మంచాల, మార్చి 20: మట్టిని అక్రమంగా తరలిస్తున్న నాలుగు టిప్పర్లను మంచాల పోలీసులు సీజ్ చేశారు. మంచాల ఎస్సై రవినాయక్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం మంచాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని అస్మత్‌పూర్ గ్రామ సమీపంలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి అక్కడి నుంచి ఇబ్రహీంపట్నానికి మట్టిని టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారనే సమాచారంతో దాడులు చేపట్టి పోలీసులు టిప్పర్లను సీజ్ చేసినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ని కలిసిన జడ్పీటీసీ

కడ్తాల్, మార్చి 20 : ఇటీవల బీఎస్పీ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని ఆయన పిలుపిచ్చినట్లు వెంకటేశ్ తెలిపారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

- ఆర్డీవో అనంతరెడ్డి
- మాల్‌లోని బార్డర్ చెక్‌పోస్టు పరిశీలన

ఇబ్రహీంపట్నం : సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో అనంతరెడ్డి

యాచారం, మార్చి 20 : లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆర్డీవో అనంతరెడ్డి అన్నారు. మండలంలోని జిల్లా సరిహద్దు కేంద్రమైన మాల్ చెక్‌పోస్టును బుధవారం ఆయన సందర్శించారు. పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్న తీరును స్వయంగా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించొద్దన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించినవారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. రూ.50,000ల కంటే మించి నగదును రవాణా చేయరాదన్నారు. ఎక్కువ మొత్తంలో నగదును తీసుకెళ్తే తప్పనిసరిగా రశీదులు చూపించాలన్నారు. లేదంటే డబ్బులను సీజ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. అక్రమంగా డబ్బులు, బంగారం, మద్యం రవాణా చేస్తే వాహనాలతో పాటుగా వాటిని సీజ్ చేసి బాధ్యులపై క్రిమినల్ కేసులను నమోదు చేస్తామన్నారు. నియోజకవర్గ మండలాల్లో మరిన్ని చెక్‌పోస్టులను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ అధికారులు, పోలీసులకు అన్ని విధాలుగా సహకరించాలన్నారు. సమస్యాత్మక, అతిసమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఆయన వెంట సీఐ శంకర్‌కుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

నిబంధనలకు లోబడి ప్రచారం చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం : రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలకు లోబడి ప్రచారాలు చేసుకోవాలని ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి అన్నారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో ఆయన వివిధ రాజకీయ పార్టీలతో ఆయన సమావేశం నిర్వహించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలన్నారు. ముఖ్యంగా సభలు, సమావేశాలు నిర్వహించటానికి ముందుగానే అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఎంకు చెందిన నాయకులు సామెల్, బోసుపల్లి ప్రతాప్, జిలమోని రవీందర్ పాల్గొన్నారు.

యాచారం : మాల్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న ఆర్డీఓ అనంతరెడ్డి

మిషన్‌భగీరథ నీళ్లు వృథా

మిషన్‌భగీరథ ట్యాంక్ వద్ద ఓవర్ ఫ్లో ద్వారా బయటకు వస్తున్న నీళ్లు

షాద్‌నగర్‌టౌన్, మార్చి 20: షాద్‌నగర్ మున్సిపాలిటీలోని అగ్నిమాపక కేంద్రం పక్కన ఉన్న మిషన్‌భగీరథ ట్యాంక్ వద్ద ఓవర్ ఫ్లో కావడంతో నీళ్లు వృథాగా పోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ట్యాంక్ పూర్తిగా నిండిపోయి ఓవర్ ఫ్లో అవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో నీళ్లు వృథాగా పోతున్నాయని పేర్కొంటున్నారు. ఈ మిషన్‌భగీరథ ట్యాంక్ ద్వారానే గ్రామీణ ప్రాంతాలకు నీళ్లు సరఫరా అవుతాయని, దారిపొడవునా నీళ్లు వృథాగా పోవడంపై పలువురు మండిపడుతున్నారు. వేసవికాలంలో నీళ్లు వృథాగా కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ఇప్పటికైనా స్పందించి ఓవర్ ఫ్లో కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఆలయంలో ముగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న భక్తులు

ఆమనగల్లు, మార్చి 20 : ఆమనగల్లు పట్టణంలోని అలివేలు మంగ సమేత శ్రీ వెంకటగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముగింపు కార్యక్రమం ఆలయ ప్రధాన అర్చకుడు గూడ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా ఉదయం సుదర్శన హవనం, మహా పూర్ణాహుతి సమాప్తం, చక్రతీర్థం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు రాము దంపతులు, నర్సింహ దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ పూజలో పాల్గొని భవాని మాతను దర్శించుకుంటున్న నాయులు , భక్తులు

మొయినాబాద్, మార్చి 20 : మండల పరిధిలోని చిన్నషాపూర్ గ్రామంలో మూడు రోజులుగా అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం కొనసాగగా, బుధవారం మహోత్సవ పూజా కార్యక్రమాలు ముగిశాయి. గ్రామంలో నూతనంగా భవానిమాత, పోచమ్మ అమ్మవార్ల ఆలయాలు నిర్మించారు. అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా నిర్వహించారు. సాయంత్రం భవాని మాత అమ్మవారికి భక్తులు బోనాలను సమర్పించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కోంపల్లి అనంతరెడ్డి, పామన భీంభరత్, షాబాద్ దర్శన్, తమ్మల మాణెయ్య, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ రాంరెడ్డి, మాజీ ఎంపీపీ కండిక రమేశ్, కేబుల్ రాజు, మందడి సత్తిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రాజేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రస్వామి కల్యాణం

వీరభద్రస్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 20 : బలిజగూడలో మూడు రోజులుగా అత్యంత వైభవంగా నిర్వహించిన వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి వీరభద్రస్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఈ కల్యాణానికి జడ్పీటీసీ బింగి దాస్‌గౌడ్, వైస్ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. మాజీ సర్పంచ్ బుర్ర వీరస్వామిగౌడ్, మాజీ ఉపసర్పంచ్ సురేశ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు వెంకటేష్‌గౌడ్ పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారికి సమర్పించారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కడ్తాల్ : రావిచేడ్ గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం నిత్యారాధన, ధ్వజారోహణం, హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. గు కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త రామచందర్‌రావు, క్రాంతికుమార్, ఆలయ అర్చకులు శ్రీమాన్ తిరుమల వింజమూరి రామానుజాచార్యులు, శ్రీమాన్ ఆచార్య ఆదిత్య, చిదంబరశర్మ, శిరీష్‌కుమార్, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేసిన జడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి

షాబాద్, మార్చి 20: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆవుల మల్లేశ్, నవనీత దంపతుల కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని బొబ్బిలిగామ గ్రామంలో మల్లేశ్ కుటుంబాన్ని పరామర్శించి రూ.20వేలు అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచులు సుధాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, యూత్ నాయకుడు వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

పెరిగిన నియోజకవర్గ ఓటర్ల సంఖ్య

- అసెంబ్లీ కంటే పార్లమెంట్ ఎన్నికలకు 27వేల ఓటర్లు

ఇబ్రహీంపట్నం, మార్చి 20 : ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలకు తర్వాత 27,693ఓట్లు అదనంగా పెరిగాయి. అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో 3,10,432ఓట్లు ఉండగా, పార్లమెంట్ ఎన్నికల నాటికి 3,37,693ఓట్లకు చేరుకున్నది. నియోజకవర్గంలో మొత్తం 319పోలింగ్ కేంద్రాలున్నాయి. నియోజకవర్గంలో మొత్తం 1,70,022పురుషుల ఓట్లు ఉండగా, 1,67,636మహిళా ఓటర్లున్నారు. ఇందులో యాచారం మండలంలో 59పోలింగ్ కేంద్రాలుండగా, 24,212మంది పురుషులు, 24,238మంది మహిళలున్నారు. మంచాల మండలంలో 45 పోలింగ్ కేంద్రాలుండగా 20,309పురుష ఓటర్లుండగా, 19,631 మహిళా ఓటర్లున్నారు. ఇబ్రహీంపట్నం మండలంలో 76 పోలింగ్ కేంద్రాలుండగా, 35,686పురుష ఓటర్లు, 36,407 మహిళా ఓటర్లున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో 139 పోలింగ్ కేంద్రాలుండగా, 89,815పురుష ఓటర్లు, 87360 మహిళల ఓట్లున్నాయి. 35 థర్డ్‌జండర్స్ ఓటర్లున్నారు.

కానిస్టేబుల్‌పై దుండగుల దురుసు ప్రవర్తన

యాచారం, మార్చి 20 : ఆర్టీసీ బస్సులో డ్రైవర్, కండక్టర్‌తో పాటుగా ప్రయాణికులతో దురుసుగా వ్యవహరించి వీరంగం చేస్తూ గొడవకు దిగిన ముగ్గురిపై యాచారం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి సీఐ శంకర్‌కుమార్ తెలిపిన కథనం ప్రకారం... నల్లగొండ జిల్లా దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో తనేదార్‌పల్లికి చెందిన పందుల సూరి, పందుల మురళి, పందుల రామలింగం మంగళవారం రాత్రి మండలంలోని మాల్ వద్ద బస్సు ఎక్కారు. బస్సులో కండక్టర్, డ్రైవర్‌తో పాటు ప్రయాణికులతో అనవసరంగా గొడవకు దిగారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ వీరంగం చేశారు. దీంతో బస్సును నేరుగా యాచారం పోలీస్‌స్టేషన్ వద్ద ఆపి వారిని పోలీసులకు అప్పగించేందుకు తీసుకెళ్తుండగా వారిపై దాడికి పాల్పడ్డారు. పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసులను బూతులు తిడుతూ ఓ కానిస్టేబుల్ కాలర్ పట్టుకొని దురుసుగా ప్రవర్తించాడు. స్టేషన్‌లో పోలీసుల విధులకు తీవ్ర ఆటంకం కలిగించడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. వారిని రిమాండ్‌కు తరలించనున్నట్లు సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం: ఉప్పల

మన్సూరాబాద్, మార్చి 20: నాగోల్, మమతానగర్, బసవేశ్వరకాలనీలో శ్రీశైల మల్లికార్జున సమాజోత్తాన ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి శ్రీ ఆదిజగద్గురు పండితారాధ్య విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, శ్రీ మహాత్మ బసవేశ్వర అక్క మహాదేవి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని భక్తి, శ్రద్ధలతో నిర్వహించారు. ఉజ్జయిని జగద్గురు, శ్రీశైలం జగద్గురు శ్రీమద్ కాశి జగద్గురు స్వాముల పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై పూజలు నిర్వహించారు.

చిరుధాన్యాల్లో పోషకాలు పుష్కలం

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి
- మండలాల్లో పోషణ పక్షం

ఆదిబట్ల : ఇటుకల బట్టీ వద్ద పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో శాంతిశ్రీ

కడ్తాల్, మార్చి 20 : గర్భిణులు, బాలింతలు నిత్యం చిరుధాన్యాలు తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు చిరుధాన్యాలపై అవగాహనతోపాటు, చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శబరి మాట్లాడుతూ చిరుధాన్యాల్లో అనేక పోషక విలువలు ఉన్నాయని తెలిపారు. నిత్యం ఆహారంలో రాగులు, సజ్జలు, కొర్రలు, జొన్నలు, సామలు, అరికలు తీసుకోవాలని పేర్కొన్నారు. బాలికల్లో రక్తహీనత రాకుండా ఉండేందుకు ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవాలని సూచించారు. చిరుధాన్యాల్లో అధిక మోతాదులో కార్బోహైడ్రేట్స్, ప్రొటీన్స్, ఫైబర్ ఉంటాయని, తక్కువ మోతాదులో క్యాలరీలు ఉంటాయని వివరించారు. అంగన్‌వాడీ ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని మహిళలు, బాలింతలు, చిన్నారులు విధిగా తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జ్ఞానేశ్వరి, భాగ్య, యాదమ్మ, మంగ, ఏఎన్ఎంలు, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : చిరుధాన్యాలతో అధిక పోషకాలు ఉంటాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పార్వతి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా (పోషణ పక్షం) వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ మాట్లాడుతూ గర్భిణులు బాలింతలు, చిన్నారులో పౌష్టికాహార లోపం అధిగమించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. అనంతరం పోషక పదార్థాలు, చిరుధాన్యాల ప్రాముఖ్యత, చిరుధాన్యాలతో తయారుచేసిన వంటకాల ప్రాధాన్యత తెలియజేశారు. అనంతరం కార్యక్రమంలో భాగంగానే ఒక చిన్నారికి అన్నప్రసన్న కార్యక్రమం చేపట్టారు. తదతనంతరం ప్రతిజ్ఞ కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ఆదిబట్ల : ప్రతి మహిళ పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో శాంతిశ్రీ అన్నారు. మున్సిపాలిటీలోని మమ్మరాజుగూడ గ్రామంలో ఇటుకల బట్టీల్లో పని చేసే మహిళలకు పోషణ పక్షంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. సంపూర్ణ ఆహారం తీసుకోవడం వల్ల మనకు ఎలాంటి రుగ్మతలు రావని వివరించారు. అనంతరం బియ్యం, పప్పులు, పాలు, పండ్లు, బాలామృతం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ సరళ, అంగన్‌వాడీ టీచర్ బేబి, సుజాత, గర్భిణులు పాల్గొన్నారు.

కడ్తాల్ : చిన్నారితో అక్షరభ్యాసం చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి

ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- ఎంపీపీ విజయలక్ష్మి రమణారెడ్డి

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి

చేవెళ్లటౌన్, మార్చి 20: బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ విజయలక్ష్మి రమణారెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఒక్కొక్క అధికారి ఎజెండాలను చదివి వినిపించారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు నాయకులు సభ దృష్టికి తీసుకరావడంతో గ్రామాల్లో నీటి సరఫరా పై తగు చర్యలు తీసుకోవడం జరిగిందని గ్రామీణ నీటి సరఫరా ఏఈఈ తెలిపారు. అలాగే గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు చూడాలని వైస్ ఎంపీపీ కర్నె ప్రసాద్‌తో పాటు పలువురు సభ్యులు కోరారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎంపీపీ విజయలక్ష్మి రమణారెడ్డి మాట్లాడుతూ.. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆమె పేర్కొన్నారు. గ్రామాల్లో చేపట్టిన పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా పూర్తి చేయాలని సూచించారు. మండలంలో విద్యుత్ కోతలు అధికంగా ఉన్నాయని, కోతలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయలక్ష్మి రమణారెడ్డి, ఎంపీడీవో హిమబిందు, మండల విద్యాధికారి అగ్బర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



దేవస్థాన కమిటీకి రూ. 50 వేల చెక్కును అందజేస్తున్న మల్లేశ్ నాయక్

ఆమనగల్లు, మార్చి 20 : ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మేడిగడ్డ మాజీ ఉపసర్పంచ్ మల్లేశ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని మేడిగడ్డ తండాలో నిర్మిస్తున్న నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి మాజీ ఉప సర్పంచ్ మల్లేశ్‌నాయక్ బుధవారం రూ.50వేల విలువ గల 6వేల ఇటుకలతో పాటు సామగ్రి అందజేశాడు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంబర్‌సింగ్, మాజీ వార్డు సభ్యులు శంకర్, నాయకులు విజయ్ రాథోడ్, శంకర్, మణిపాల్, రమేశ్, శ్రీను, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యుడు

మంచాల, మార్చి 20: మంచాల మండలం రంగాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులకు రోటరీ క్లబ్, జ్ఞానసరస్వతీ మహిళా విభాగం, సాధ్రి సమన్వయ సహకారంతో బుధవారం ఆరుగురు విద్యార్థినులకు సైకిళ్లను ఉపాధ్యాయులతో కలిసి వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటర్ క్లబ్ అధ్యక్షురాలు నిధి ఆనంద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థినులకు తమ సంస్థనుంచి సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, రోటరీ క్లబ్ సభ్యులు సీమాకుమార్, ధినేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

ఆమనగల్లు, మార్చి 20: నిలిపి ఉన్న కారును స్టార్ట్ చేయడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి దగ్ధమైంది. ఈ ఘటన ఆమనగల్లులోని ఆదర్శనగర్ కాలనీలో బుధవారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ మల్లాపూర్‌కు చెందిన ఎదిరే శశికుమార్ తన కారులో బంధువుల ఇంట్లో జరిగిన శుభాకార్యానికి ఆమనగల్లుకు వచ్చాడు. ఉదయం కారును స్టార్ట్ చేయగా, షార్టు సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. వెంటనే నీరుపోసి మంటలు ఆర్పటానికి ప్రయత్నం చేయగా అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది.